క్లుప్తంగా

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న యూఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు జగన్

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. మంగళవారం చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో ప్రైవేట్ కళాశాల యజమాన్యాలు కళాశాలలను మూసివేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. మరో వైపు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో మౌలిక వసతులు కల్పించడంతో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ప్రభుత్వం విద్యార్థి సమస్యలపై వెంటనే స్పందించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

హవేళి ఘణపూర్(మెదక్): మండలంలోని కొచ్చెర్వు తండాలో మృతి చెందిన నిరుపేద వృద్ధుడి అంత్యక్రియలకు యూత్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. తండాకు చెందిన ముడావత్ పుల్యానాయక్ (75) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించడానికి ఇబ్బందులు పడొద్దని ఔరంగాబాద్ తండా గంగానాయక్ యూత్ అసోసియేషన్ సభ్యులు రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. దీనితో దహన సంస్కారాలు పూర్తి చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు, సభ్యులు ఉన్నారు.

పోషణమాసంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలంలోని నల్లకుంటతండాలో పోషణమాసంపై గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ టీచర్ సుజాత గురువారం అవగాహన కల్పించారు. సమయానికి పౌష్టికాహారం తీసుకోవాలని, రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

జెడ్పీటీసీ అభ్యర్థిగా రెడ్యానాయక్



రెడ్యానాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): మండల జెడ్పీటీసీ అభ్యర్థిగా బద్యాతాండాకు చెందిన ఎస్టీ మోర్చా మాజీ అధ్యక్షుడు రెడ్యానాయక్‌ను ఎంపిక చేశారు. తనను జెడ్పీటీసీ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు రెడ్యానాయక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సిద్ధు, మండల అధ్యక్షుడు శంకర్, కార్యవర్గ సభ్యుడు రాజు, శ్యామయ్య, రాములు, సేనాపతి, దుర్గాప్రసాద్, వినోద్‌కుమార్, నాగరాజు, టేక్మాల్ పట్టణ అధ్యక్షుడు వెంకట్ పాల్గొన్నారు.

స్టాటర్‌బాక్స్ ఏర్పాటు



పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాటర్‌బాక్స్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాజిపేట పాఠశాలలో హెచ్‌ఎం సొంత నిధులతో మంగళవారం స్టాటర్‌బాక్స్‌ను ఏర్పాటు చేశారు. దసరా సెలవుల సందర్భంగా గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలో మీటర్, స్టాటర్‌బాక్స్ ధ్వంసం చేసిన విషయం విధితమే. దీంతో హెచ్‌ఎం సొంత నిధులతో కొత్త స్టాటర్‌బాక్స్ ఏర్పాటు చేశారు. అలాగే, పాఠశాలలో ఇతర మరమ్మతులను చేయించారు.

అత్యవసరమైతే.. ఆరుబయటకే

ప్రభుత్వ కార్యాలయాల్లో టాయిలెట్స్ కరువు

- మహిళల కష్టాలు వర్ణనాతీతం
- పాఠశాల, బస్టాండ్‌లే దిక్కు



ఎంపీడీఓ కార్యాలయంలోని టాయిలెట్ రూమ్ దుస్థితి

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేక ఉద్యోగులు తీవ్రమైన అవస్థలు పడుతున్నారు. ఇక మహిళా ఉద్యోగుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కౌడిపల్లిలో ఒకే ఆవరణలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం, ఐకేపీ, ఉపాధిహామీ, ఎంఈఓ(ఎంఆర్‌సీ), వ్యవసాయశాఖ డివిజన్, పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయాలు, పశువుల ఆస్పత్రి ఉన్నాయి. ఎంపీడీఓ కార్యాలయంలో ఎనిమిది మంది మహిళా కార్యదర్శులు, ఏడీఏ కార్యాలయంలో ఏడీఏ, ఏఓ, ఏఈఓలు, ఆత్మ సిబ్బంది, ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం, సీసీలు, సీఏలు, 29 మహిళా సమాఖ్య సభ్యులు ఉన్నారు. వారికి తోడు ప్రతిరోజు వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు మహిళలు వస్తుంటారు.

బయటకు వెళ్లాల్సిందే..

ఇన్ని కార్యాలయాలు, ఇంతమంది మహిళా ఉద్యోగులు ఉన్నా టాయిలెట్స్ మాత్రం లేవు. ఎంపీడీఓ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. అందులో ఒకే ఒక్క టాయిలెట్ ఉంది. నిర్వహణ సరిగాలేక దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో మహిళలు ఒకటికి, రెంటికి ఎక్కడకి వెళ్లాలో తెలియని దుస్థితి. లేదా ఇంటికి వెళ్లే వరకు భరించాల్సిందేనని మహిళా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎంఈఓ ఆఫీస్‌లో నిర్వహణలేని టాయిలెట్

బస్టాండ్, పాఠశాలే దిక్కు

ఐకేపీ కార్యాలయంలో ఒకే ఒక్క టాయిలెట్ ఉంది. ఇది అధికారులు మాత్రమే వినియోగిస్తారు. ఇక మండల, గ్రామ సమాఖ్య సమావేశాలు, అధికారుల సమీక్షలు నిర్వహించినప్పుడు మహిళలు అధిక సంఖ్యలో వస్తారు. ఆ సమయంలో వారి కష్టాలు వర్ణనాతీతం. ఎంఈఓ కార్యాలయంలో టాయిలెట్ పైపులైన్ ధ్వంసమై నిరుపయోగంగా మరింది. ఇక్కడికి వచ్చే సీఆర్‌పీ, ఉపాధ్యాయులు దూరంలో ఉన్న పాఠశాల, బస్టాండ్‌కు వెళ్లి అవసరాలు ముగించుకుంటున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్య

టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడుతున్నామని గతనెలలో జరిగిన మండల స్థాయి సమీక్షలో మహిళా అధికారులు ఎమ్మెల్యే సునీతారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆమె సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు మహిళలు తెలిపారు. అయినా అధికారులు స్పందించి తమ ఇబ్బందులు తొలిగించాలని వారు కోరుతున్నారు.



ఎమ్మెల్యేకి మొరపెట్టుకుంటున్న మహిళా ఉద్యోగులు

ఇందిరమ్మ ఇళ్లకు ‘కోడ్’ అడ్డంకి

నిలిచిన నిర్మాణ పనులు
ఇబ్బందుల్లో లబ్ధిదారులు



గుల్పర్తిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులు

రామాయంపేట(మెదక్): కొత్తగా ప్రారంభిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. దీంతో జిల్లా వ్యాప్తంగా వందలాది ఇళ్ల నిర్మాణం పనులు నిలిచిపోయాయి. ఎన్నికల కోడ్ ముగిసేవరకు నిర్మాణాలు చేపట్టవద్దని ఉత్తర్వులు జారీ కావడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో మొదటి, రెండో విడతలో మొత్తం 9,160 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 5,569 ఇళ్ల పనులు కొనసాగుతుండగా, కొన్ని స్లాబ్ లెవల్ వరకు పూర్తయ్యాయి. వీటికి బిల్లులు సైతం వచ్చాయి. చాలావరకు ఇళ్ల నిర్మాణం పనులు చివరి దశకు వచ్చాయి. మిగతా 3,591 ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఆర్థిక స్తోమత లేకపోవడంతో లబ్ధిదారులు పనులు ప్రారంభించలేదు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి సామగ్రి ధరల పెరుగుదల కూడా కారణమే. నెల పదిహేను రోజులుగా కురుస్తున్న వర్షాలు పనులకు అడ్డంకిగా మారాయి. వర్షాలు తగ్గడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభించాలని నిర్ణయించుకున్న క్రమంలోనే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో అధికారుల ఆదేశాలమేరకు పనులు నిలిచిపోయాయి.

ఆర్థిక ఇబ్బందులతో..

నాలుగు నెలల క్రితమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో ఆర్థిక ఇబ్బందులతో పనులు ప్రారంభించలేకపోయామని కొందరు లబ్ధిదారులు పేర్కొన్నారు. పనులు ప్రారంభించే క్రమంలో నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు సైతం ఆటంకం కలిగిస్తున్నాయని వారు వాపోయారు. కోడ్ ముగిసిన తరువాతే పనులు ప్రారంభించాలని అధికారులు సూచిస్తున్నారని తెలిపారు.

కోడ్ ముగిసిన వెంటనే..



జిల్లా పరిధిలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఇందులో కొన్ని చివరి దశకు చేరుకున్నాయి. నాలుగు నెలల క్రితమే ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసినా 3,591 మంది నిర్మాణం పనులు ప్రారంభించలేదు. కోడ్ ముగిసిన వెంటనే పనులు ప్రారంభించాలి.

– మాణిక్యం, పీడీ, గృహ నిర్మాణశాఖ

దెబ్బతిన్న పంటల పరిశీలన



పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొల్చారం(నర్సాపూర్): వరుసగా కురుస్తున్న వర్షాలతో వ్యాధులు సోకి దెబ్బతిన్న వరి పంటలను మంగళవారం కేవీకే తునికి శాస్త్రవేత్తలు రవికుమార్, ప్రతాప్ రెడ్డి వరిగుంతం, సంగాయిపేట గ్రామాల్లోని వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరిని దోమ పోటు ఆశించినట్లు గుర్తించారు. దోమపోటు సోకిన వరి పొలాలు దూరం నుంచి చూస్తే ఎర్రగా సుడులు సుడులుగా ఎండిపోయినట్లుగా వ్యాధి లక్షణాలు కనిపిస్తాయన్నారు. దీని నివారణ కోసం ఎకరాకు ట్రిఫ్లూమెజో పైరిమ్ 94మి.లీ. మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలని శాస్త్రవేత్తలు సూచించారు. ఏఈవో శ్వేతకుమారి ఉన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని మండలంలోని మడూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రవీందర్ రెడ్డి సూచించారు. మంగళవారం మడూర్ పాఠశాలలో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలించా వారిని ఉన్నత విద్యవంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఏపీఎల్ కార్మికుల నిరసన



వడియారం అపోలో పరిశ్రమ ఎదుట కార్మికుల నిరసన

చేగుంట(తూప్రాన్): మండల పరిధిలోని వడియారంలో ఏపీఎల్ అపోలో పరిశ్రమ వద్ద కార్మికులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బీఎంఎస్ కార్యదర్శి నర్సింహులు మాట్లాడుతూ 14 సంవత్సరాలుగా పరిశ్రమలో పని చేస్తున్న ముగ్గురు కార్మికులను యాజమాన్యం అక్రమంగా బదిలీ చేసినట్లు పేర్కొన్నారు. యాజమాన్య వైఖరికి వ్యతిరేకంగా తాము నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సంఘం నాయకులు రాజ్ కుమార్ చవాన్ సురేష్, కుమార్, శ్రీనివాస్, నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రమేశ్

చేగుంట(తూప్రాన్): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పొలంపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం... పొలంపల్లి గ్రామానికి చెందిన వట్టెం రమేశ్(32) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అప్పులు ఎక్కువ కావడంతో వాటిని తీర్చే మార్గం కనిపించక ఈనెల 4న పురుగుల మందు తాగాడు. గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు



మాట్లాడుతున్న ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్

మనోహరాబాద్(తూప్రాన్): యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లి తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మనోహరాబాద్ ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండలంలోని ముప్పిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు కళాజాత బృందం ఎస్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్, వాటి వల్ల కలిగే ప్రభావాలు, నివారణ, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, బాల్యవివాహాలు, మానవ రవాణా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. షీ టీం వల్ల ఉపయోగాలు, సమస్యల నుంచి ఎలా తప్పించుకోవాలో తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సురేందర్, జనార్దన్, షీ టీం ఇన్‌చార్జి గంగమని శ్రీనివాస్, హెచ్‌ఎం మహంకాళి, ఉపాధ్యాయులు అశోక్, రాంప్రసాద్, అంజిరెడ్డి, అంషా, భ్రమలత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచడమంటే తొలగిస్తారా?

పరిశ్రమ ఎదుట కార్మికుల ఆందోళన

శివ్వంపేట (నర్సాపూర్): వేతనాలు పెంచాలని కోరినందుకు విధుల్లోకి రానివ్వకపోవడంతో పరిశ్రమ ఎదుట మంగళవారం కార్మికులు ఆందోళనకు దిగారు. మండల పరిధి నవపేట్ లోని లూయిస్ పరిశ్రమలో 16 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్నామని, తమకు చాలీచాలని వేతనాలు ఇస్తున్నారని వారు తెలిపారు. వేతనాలు పెంచాలని కోరడంతో విధుల్లో తీసుకోవడం లేదని కార్మికులు సుగుణ, సుజాత, శ్రీనివాస్, మంజుల అన్నారు. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పరిశ్రమ ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. న్యాయబద్ధంగా తమకు వేతనాలు చెల్లించి పరిశ్రమలో ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయం గురించి పరిశ్రమ హెచ్‌ఆర్ సత్యనారాయణ వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలి

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సుభవల్లి



సంధ్యా నిలయంలో మాట్లాడుతున్న సుభవల్లి

మెదక్ కలెక్టరేట్: లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్ఎం సుభవల్లి తెలిపారు. మంగళవారం మెదక్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డీ అడిక్షన్, రీహాబిటేషన్ సెంటర్‌కు సంబంధించిన లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక సీఎస్‌ఐ చర్చి కాంపౌండ్‌లో గల వృద్ధాశ్రమం (సంధ్యా నిలయం)ను ఆమె సందర్శించారు. అక్కడి వృద్ధులతో మాట్లాడి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీత, లాడ్స్ డిప్యూటీ చీఫ్ రామశర్మ, ప్యానల్ లాయర్లు కరుణాకర్, దుర్గారెడ్డి, పట్టణ సీఐ మహేష్, పాస్టర్ స్టువర్ట్, ఫ్రాంక్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు గడువు పొడిగింపు

ఆన్‌లైన్‌లో 21 వరకు దరఖాస్తుల స్వీకరణ



వర్గల్(గజ్వేల్): నవోదయలో 2026–27 విద్యాసంవత్సరం 9వ, 11వ తరగతులలో ఖాళీ సీట్లలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ గడువు అక్టోబర్ 21 వరకు పొడిగించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ గడువు మంగళవారం ముగియాల్సి ఉంది. అయితే విద్యార్థుల ప్రయోజనం కోసం మరోసారి గడువు పెంచుతూ నవోదయ విద్యాలయ సమితి ఆదేశాలు జారీచేసిందని స్థానిక నవోదయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని అర్హులైన విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

నంగునూరు(సిద్దిపేట): బీఫార్మసీ, ఫార్మ్‌డీ, ఫార్మసుటికల్ ఇంజనీరింగ్, బయో మెడికల్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే టీజీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 300 మంది విద్యార్థుల హాజరయ్యారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్ మాట్లాడుతూ గురువారం వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ఐడీ, పాస్‌వర్డు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కబడ్డీ ఎంపిక పోటీలు

సిద్దిపేట ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 విభాగంలో ఉమ్మడి మెదక్ జిల్లా కబడ్డీ క్రీడాకారుల ఎంపికలు సిద్దిపేట ప్రభు త్వ జూనియర్ కళాశాల(కోఎడ్యుకేషన్)లో బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ అండర్ 19 జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సమ్మయ్య మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 9న గజ్వేల్ బాలికల జూనియర్ కళాశాల మైదానంలో సిద్దిపేట జిల్లా క్రీడాకారులకు ఖోఖో, వాలీబా ల్ క్రీడల ఎంపిక పోటీలను నిర్వహించనున్న ట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో తప్పిపోయిన బాలుడిని స్టేషన్ మాస్టర్ తల్లిదండ్రులకు అప్పగించారు. హైదరాబాద్–పూర్ణ ఎక్స్‌ప్రెస్ రైలులో కుటుంబ సభ్యులతో ప్రయాణిస్తున్న 5 సంవత్సరాల అఖిలేశ్ అనే బాలుడు మంగళవారం జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో తప్పిపోయాడు. స్టేషన్ మాస్టర్ మాధవకృష్ణ గుర్తించి చేరదీశారు. బాలుడి ద్వారా తల్లిదండ్రుల వివరాలు సేకరించి సమాచారం అందజేశారు. కర్నాటక రాష్ట్రం బీదర్ పట్టణంలో ఉంటున్న బాలుడు తండ్రి స్వామిదాస్‌రాజా స్టేషన్‌కు వచ్చి మాధవరావును కలిశారు. విచారించిన తరువాత బాలుడిని తండ్రికి అప్పగించారు.

వాల్మీకి ఆశయాలే ఆదర్శం



వాల్మీకి జయంతి వేడుకల్లో మున్సిపల్ కమిషనర్, సిబ్బంది



జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం మహర్షి వాల్మీకి చిత్రపటానికి జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆత్మశోధన ద్వారా మహానుభావుడిగా మారి, మనందరికీ ఆదర్శప్రాయమైన రామాయణం గ్రంథాన్ని రచించారని అన్నారు. మన మనసు మారితే ఎవరైనా మహానుభావులుగా ఎదగగలరని తెలిపారు. ఆయన చూపిన సత్యం, ధర్మం, నీతి మార్గాల్లో నడుచుకుంటూ సమాజానికి సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు సుభాష్ చంద్ర బోస్, రంగనాయక్,, సీఐలు మధుసూదన్ గౌడ్, సందీప్‌రెడ్డి, ఆర్ఐలు రామకృష్ణ, శైలేందర్, ఏఓ మణి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

తూప్రాన్: మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కమిషనర్ గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహనీయుల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సంక్షిప్త వార్తలు

◆ వైభవంగా భవానీమాత ఉత్సవాలు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని శ్రీ భవానీమాత విజయదశమి ఉత్సవాలు పౌర్ణమితో ముగిశాయి. మంగళవారం ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య మహాచండీయాగం నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలయ ధర్మకర్తలు ఆర్ఎన్.సంతోష్, శ్రీనివాస్, శివకుమార్, పురోహితులు కృష్ణశర్మ, సంగమేశ్వరశర్మ, అభిలాష్‌శర్మ, కార్తీక్‌శర్మ, భార్గవశర్మ తదితరులు ఉన్నారు.

◆ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

రేగోడ్(మెదక్): నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ.పోచయ్య హెచ్చరించారు. రేగోడ్‌లో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల వెంట ధ్రువపత్రాలను తప్పకుండా ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

◆ ఎల్‌ఓసీ అందజేత

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట మండలం మూసాపేటకు చెందిన జి.సాయమ్మకు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల 50 వేల ఎల్‌ఓసీని ఎంపీ సురేశ్ షెట్కార్ హైదరాబాద్‌లో అందజేశారు. ఆయన వెంట పీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్, మాజీ ఆత్మ చైర్మెన్ జైహింద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



నర్సాపూర్: క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే సునీతారెడ్డి అందచేశారు. పేదలకు సహాయం అందించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

◆ ఎల్‌ఓసీ చిరుధాన్యాలతో పోషకాలు

నారాయణఖేడ్: చిరుధాన్యాలు, ముతక ధాన్యాలతో పోషకాహారం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత తెలిపారు. మంగళవారం నిజాంపేట్ మండలం బాచేపల్లిలోని అంగన్‌వాడీ సెక్టార్‌లో పోషణ మాసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. పాలిచ్చే తల్లులు, గర్భిణులు , కిశోర బాలికలకు పోషకాహారం చాలా అవసరమన్నారు.